# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ

నెం. పి.ఎ/జనరల్(6)/2000-సి.యం.ఇ.(సి & ఐ)

వైస్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయం
ముషీరాబాద్, హైదరాబాద్.
తేది. 29-06-2001

## సర్క్యులర్ నెం. 19/2001-యం.ఇ.డి., తేది 29-06-2001

విషయం :-- అధికార భాష : బస్సుల మీద బస్సు నెంబరు మరియు డిపో పేరు తెలుగులో రాయుట గురించి.

నిర్దేశం :-- 1) ఈ కార్యాలయ సర్క్యులర్ నెం. 39/2000-యం.ఇ.డి., తేది 27-10-2000.
2) ,, ,, నెం. 43/2000-యం.ఇ.డి., తేది 30-12-2000.
3) ,, ,, నెం. 02/2001-యం.ఇ.డి., తేది 29-01-2001.
4) రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుల వారి లేఖ నెం. 28/అ.భా.స. సం./2001, తేది 13-6-2001.

బస్సుల మీద బస్సు నెంబరు, డిపో పేరు తెలుగులో రాయాలని నిర్దేశం ఒకటిలో పేర్కొన్న సర్క్యులర్ ద్వారా అప్పటి మేనేజింగ్ డైరెక్టర్ గారు ఆదేశించారు. ఆ తదనంతరం ప్రయాణీకుల నుంచి పలు ఫిర్యాదులు/విమర్శలు రావడంతో పై నిర్దేశం 2, 3ల్లోని సర్క్యులర్ల ద్వారా ఆదేశాలను సవరిస్తూ, ఉపసంహరిస్తూ తిరిగి ఆదేశాలు జారీచేయడం జరిగింది.

జూన్ 19, 2001 నాడు కేంద్ర కార్యాలయములో మేనేజింగ్ డైరెక్టరుతోనూ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, హెచ్.ఓ.డీలతో అధికార భాష అమలు విషయంలో జరిగిన సమీక్షా సమావేశంలో బస్సులపై తెలుగు అంకెలు, అక్షరాలు రాయడం విషయంలో తగ్గిన శ్రద్ధ పట్ల రాష్ట్ర అధికార భాష సంఘం అధ్యక్షులు డా॥ మాడుగుల నాగఫణి శర్మ గారు అసంతృప్తిని వ్యక్తపరిచారు. ఇంగ్లీషు అంకెలను, అక్షరాలను తొలగించకుండా బస్సుకు మరో ప్రక్కన తెలుగు బస్సు నెంబర్లు రాయడం వల్ల ఎవరికీ ఇబ్బంది ఉండదని, విమర్శలకు కూడా ఆస్కారం ఉండదని, ఈ పద్ధతిని పొరుగు రాష్ట్రాల బస్సుల్లో పాటిస్తున్నప్పుడు మనం పాటించడానికి అభ్యంతరం ఏమిటని వారు ప్రశ్నించారు. మన భాషని, మన సంస్కృతిని మనమే రక్షించుకోవాలని కాబట్టి తప్పనిసరిగా బస్సులన్నింటి మీదా ఇంగ్లీషు అంకెలు అక్షరాలతోపాటు తెలుగు అంకెలు అక్షరాలలో అందంగా, ఒకే పద్ధతిని పాటిస్తూ రాయాలని సూచించారు.

కాబట్టి పై సూచనలను అనుసరించి సవరించిన ఈ దిగువ ఆదేశాలు జారీచేయడమైనది.

1) బస్సులపై వెనక భాగమున ఒక పక్కన వున్న ఇంగ్లీషు అంకెలు, అక్షరాలను చెరపకుండా, మరో పక్కన తెలుగు అక్షరాలలో, అంకెలలో బస్సు నెంబర్లు రాయాలి. ఈ రెండు బోర్డులను క్రింది భాగములో వీలును/స్థలం అందుబాటును బట్టి పై భాగములో గాని, బంపర్ మీద గానీ ఒక వైపు "ఆగుము" మరో వైపు STOP అనే అక్షరాలను పెయింట్ చేయించాలి.

2) బస్సు ముందు / వెనక భాగములో పైన ఒక మూలన డిపో పేరు తెలుగులో గతంలో మాదిరిగా వ్రాయాలి. అక్షరాల సైజు 4" ఎత్తు మించకుండా వ్రాయాలి.

సులువుగా అర్థమయ్యేందుకు ఈ దిగువన బస్సు చిత్రాల్లో అక్షరాలు, అంకెలు రాసే విధానం చూపడమైనది.

పై ఆదేశాలకు తోడు డిపోలో వీలును బట్టి 10 శాతం బస్సుల మీద బస్సు వెలుపలి భాగంలో ఏదో ఒక వైపున ఈ కింది వాటిలో ఒక నినాదం చొప్పున అందంగా పెయింట్ చేయించాలి. 1) దేశ భాషలందు తెలుగు లెస్స. 2) తెలుగులో వ్రాయి తెలుగింతో హాయి. 3) తేట తెలుగు - తేనే లొలుకు. 4) భాషయే సంస్కృతికి జీవనాడి. 5) భాష లేనిదే సంస్కృతి లేదు. 6) ఏ జాతి మనుగడకైనా భాషయే ఆధారం. 7) భాష మన కన్న తల్లి.

బస్సులపై తెలుగు అక్షరాలు, అంకెలు వ్రాసేటప్పుడు ఇంగ్లీషు అంకెలు, ఇంగ్లీషు అక్షరాల పరిమాణానికి అనుగుణంగా ఒక పద్ధతిలో వుండే విధంగా చూడాలి. అస్తవ్యస్తంగా రాయడం వల్ల బస్సు అందం దెబ్బతింటుంది.

పై ఆదేశాలను తక్షణమే అమలు పరిచేందుకు చర్యలు తీసుకోవలసిందిగా ఆదేశించడమైనది.

Sd/-
(ఆర్. పి. సింహ)
వైస్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్